క్లుప్తంగా

హక్కుల సాధనకు పోరాటాలు



గద్వాల అర్బన్: మహిళల హక్కుల సాధనకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) నిరంతరం పోరాటాలు చేస్తోందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నర్మద తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఐద్వా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈనెల 21, 22, 23 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐద్వా రాష్ట్ర 4వ మహాసభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభలకు జిల్లాలోని మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రత్నమ్మ, జయలక్ష్మి, దివ్య, దేవిక, సరోజ, వెంకటేశ్వరి, అక్షిత తదితరులు ఉన్నారు.

నాణ్యమైన పత్తిని వేరు చేయండి



అయిజ: అధిక వర్షాలకు పంటపొలాల్లోనే పత్తి తడిసిపోయి నాణ్యత లోపించే అవకాశముందని, వర్షాలకు పంటపొలాల్లో పత్తి తడువకుండా మొక్కల నుంచి వేరు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జనార్దన్ సూచించారు. రైతులు సాగు చేసిన పంటలను ఇటీవల ఏఈఓలు నమోదు చేయగా.. వాటిని నిర్ధారించేందుకు బుధవారం మండలంలోని ఉత్తనూరు, సంకాపురం, ఈడుగోనిపల్లి శివార్లలోని పంటపొలాలను మండల వ్యవసాయ అధికారి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. తడిసిన, పొడి పత్తిని వేరు వేరుగా నిల్వ చేయాలని, తేమశాతం ఎక్కువగా లేకుండా ఎండలో పత్తిని ఆరబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ లోకరాజ్ ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కొంకలలో పశువులకు శాంతినగర్ పశువైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామంలోని 69 మంది రైతులకు సంబంధించి 233 ఎద్దులు, 602 గేదెలు మొత్తం 835 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ పుష్పలత తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వరప్రసాద్, లతీఫ్, బుచ్చమ్మ, వెంకటమ్మ, కృష్ణ, గోపాలమిత్ర నారాయణగౌడ్ పాల్గొన్నారు.

గద్వాల సీఐగా టంగుటూరి శ్రీను

గద్వాల: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టంగుటూరి శ్రీను ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం హైదరాబాద్ ఐజీ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన గద్వాల సీఐగా బదిలీపై వచ్చారు.

21 నుంచి దేవేంద్రాచార్య ఆరాధన ఉత్సవాలు

అమరచింత: మండలంలోని నాగల్‌కద్మూర్‌లో వెలసిన దేవేంద్రాచార్య మహాస్వాముల 72వ ఆరాధన ఉత్సవాలు ఈనెల 21 నుంచి 23 వరకు కొనసాగుతున్నాయని మఠ నిర్వాహకుడు నరసింహాచార్యులు తెలిపారు. దేవేంద్రాచార్య ఆరాధన ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మఠంలో బుధవారం విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేవేంద్రాచార్యులు గ్రామంలో శ్రీరామాచార్య, చంద్రాంబ దంపతులకు నాల్గో నెల 15 తేదీ 1885వ సంవత్సరంలో జన్మించారన్నారు. దేవేంద్రాచార్యులు చిన్న వయస్సులోనే తపోశక్తిని సాధించి ఎన్నో మహిమలను చూపుతూ ఇక్కడి ప్రజలకు ఆరాధ్యుడిగా మారారన్నారు. ఆరాధనోత్సవాలకు గాయత్రి పీఠాధీశ్వరుడు జగద్గురు శ్రీకాంతేంద్ర స్వామి, శ్రీకాళికాంబ ఉపాసకులు గుండెపల్లి నరేష్ ఆచార్యులు పాల్గొంటారన్నారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జగన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహులు గౌడ్, వెంకటేష్ ఆచారి, కల్వ నరసింహులు, నవీన్ కుమార్, నందకుమార్ ఆచారి, కల్వ వీరేష్, వెంకట్రాంరెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఆరుబయటకే...



చెన్నిపాడులో సామూహిక మరుగుదొడ్డి నిర్మించాల్సిన ప్రదేశం

- పల్లెల్లో అమలు కాని స్వచ్ఛతాహీ సేవా
- ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం
- కొనసాగుతున్న బహిరంగ మల, మూత్రవిసర్జన

మానవపాడు: గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు తప్పనిసరి. బహిరంగ మలమూత్ర విసర్జన చేయటంతో పల్లెల్లో అపరిశుభ్రత నెలకొని రోగాలు వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. ఈ సమస్యను పూర్తిగా రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించినా క్షేత్ర స్థాయిలో అమలు నోచుకోవడం లేదు. స్వచ్ఛ గ్రామాలుగా మార్చేందుకు మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తున్న చాలా మంది నిర్లక్ష్యం చేస్తున్నారు. గతంలో మరుగుదొడ్లు నిర్మించుకోకుంటే రేషన్, పింఛన్, కరెంట్ సరఫరా నిలిపివేస్తామని ప్రచారం చేయటంతో ఎంతో మంది నిర్మాణం చేసుకునేందుకు ముందుకు వచ్చారు.

మండలంలో..

మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 3,005 మరుగుదొడ్లకుగాను 3,003 మరుగుదొడ్లను ఆయా గ్రామ పంచాయతీల్లో నిర్మించారు. గ్రామాల వారీగా మరుగుదొడ్లు.. అమరవాయి 226, బోరవెల్లి 278, చంద్రశేఖర్‌నగర్ 103, చందూరు 116, చెన్నిపాడు 316, గోకులపాడు 94, జల్లాపురం 431, కలుకుంట్ల 54, కొర్విపాడు 262,



చెన్నిపాడులో నిరుపయోగంగా మరుగుదొడ్డి

మద్దూరు 274, మానవపాడు 455, నారాయణపురం 104, పల్లెపాడు 170, పెద్దఆముదాలపాడు 120, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాల్లో వీఎస్‌టి పొగాకు కంపెనీ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు నిర్మించారు. ప్రతి గ్రామంలో మరుగుదొడ్లను నిర్మించినా.. వాటిని ఉపయోగించడంలో ఆయా గ్రామాల ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

గ్రామస్థాయి అధికారుల నిర్లక్ష్యం

గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంలో పంచాయతీ కార్యదర్శులు విఫలమవుతున్నారు. గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంలో బహిరంగ మలమూత్ర విసర్జన ద్వారా ఉత్పన్నమయ్యే సమస్యలు వివరించాలి. కానీ సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కావడంతో.. ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారులు ఎప్పుడు గ్రామాలకు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

అధికారుల నిర్లక్ష్యం



ప్రతి గ్రామంలో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి మరుగుదొడ్లను నిర్మించారు. వాటిని ప్రజలు వినియోగించుకునేలా చేయడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం చేశారు. బహిరంగ మాల, మూత్రవిసర్జన వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి.

– మద్దిలేటి, చెన్నిపాడు

రోగాల బారిన పడే ప్రమాదం



బహిరంగ మల, మూత్ర విసర్జన కారణంగా పారిశుద్ధ్యం లోపించి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులు నిరంతరం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యానికి గండి పడుతోంది. రూ.వేలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు వృథాగా పడి ఉన్నాయి.

– సుధాకర్, చిన్నపోతులపాడు

అవగాహన కల్పిస్తాం

ప్రతి కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మండలంలో మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. బహిరంగ మలవిసర్జన చేయడం ద్వారా కలిగే అనర్థాల గురించి వివరిస్తాం. మరుగుదొడ్డి నిర్మించుకోని కుటుంబానికి ప్రభుత్వ పథకాలు నిలిపివేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

– భాస్కర్, ఎంపీడీఓ, మానవపాడు

ప్రభుత్వానికి విద్యావ్యవస్థపై చిత్తశుద్ధి లేదు



మాట్లాడుతున్న పల్లయ్య

శాంతినగర్: కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యావ్యవస్థపై చిత్తశుద్ధి లేదని, విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య ఆరోపించారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ పీకే కాంప్లెక్స్‌లో బుధవారం బీఆర్‌ఎస్వీ నాయకులు గడ్డం భరత్‌బాబు ఆధ్యక్షతన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలల యాజమన్యాన్ని, గురుకులాల భవనాల యజమానులను రోడ్ల మీదకు తీసుకొచ్చే దుస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. అటు ప్రైవేట్ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇవ్వక, ఇటు గురుకుల పాఠశాలల అద్దెలు చెల్లించకపోవడంతో యాజమానులు కళాశాలలు, గురుకుల పాఠశాలలు మూసివేయడమే గాక విద్యార్థులు ఉన్నత విద్యకు నోచుకోలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల దసరా సెలవులు అయిపోయి విద్యార్థులు గురుకుల పాఠశాలలకు వెళ్తే భవనాల యజమానులు తాళాలు వేయడంతో తిరిగి ఊర్లకు చేరుకునే దుస్థితి కాంగ్రెస్ పాలనలో ఏర్పడిందని వాపోయారు. కేసీఆర్ ఏర్పాటుచేసిన 1,022 గురుకులాల్లో మౌలిక వసతులు కల్పించక, అద్దెలు చెల్లించక వాటిని మూసివేసే కుట్రలో భాగంగానే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూళ్ల పేరుతో విద్యార్థులను మోసం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపారని ఆరోపించారు. సమావేశంలో సోమశేఖర్‌నాయుడు, మాధవ్, రాజగోపాల్ పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిద్దాం



సుస్మితను సన్మానిస్తున్న అఖిలపక్ష నాయకులు

అయిజ: మారుమూల గ్రామాల్లోనూ ప్రతిభ గల విద్యార్థులు ఉన్నారని, వారి ప్రతిభను ప్రోత్సహించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీఎం తాహేర్ అన్నారు. మండలంలోని వెంకటాపురం ప్రభుత్వ పాఠశాలలో చదివి నీట్ ప్రవేశ పరీక్షలో 588 మార్కులు సాధించిన సుస్మిత.. ఎస్సీ కేటగిరీలో ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని సుస్మితను అఖిలపక్ష నాయకులు శాలువాతో సత్కరించారు. అయిజ అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు, వెంకటాపురం ఆర్‌ఎంపీలు కలిసి సుస్మితకు రూ.50 వేలు నగదును అందించారు. కార్యక్రమంలో అఖిపక్ష కమిటీ నాయకులు ఆంజనేయులు, ప్రభాకర్, హనుమంతు, వెంకటాపురం గ్రామస్తులు తిమ్మారెడ్డి, గౌస్, షరీఫ్, వెంకట్రాముడు, మహ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



గట్టులో ఉపాధ్యాయులతో సమావేశమైన ఎంఈఓ నల్లారెడ్డి

గట్టు: కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ నల్లారెడ్డి కోరారు. 2024 డీఎస్సీలో ఎంపికై మండలానికి నూతనంగా కేటాయించబడిన 18 మంది ఉపాధ్యాయులు బుధవారం ఎంఈఓ కార్యాలయంలో రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా వారితో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఎంఈఓ నల్లారెడ్డి మాట్లాడుతూ కొత్తగా విధుల్లో చేరి ఉపాధ్యాయులు నూతన ఉత్సాహంతో పని చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఉన్నత ఎదిగేందుకు మీవంతు కృషి చేయాలన్నారు.

మానవపాడు: మండలకేంద్రంలో కొత్తగా విధుల్లో చేరని ఉపాధ్యాయులు రాజేశ్వరి, నాగరాజు, మహేష్‌ను ఎంఈఓ శివప్రసాద్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, రాష్ట్ర నాయకులు, ఉపాధ్యాయులు సన్మానించారు.



మానవపాడులో..

వాల్మీకి ఆలయంలో హోమాలు



మల్దకల్‌లో హోమం చేస్తున్న అర్చకులు

మల్దకల్: మండల కేంద్రంలోని వాల్మీకి నూతన ఆలయ పునర్నిర్మాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ ఆవరణలో వేదపండితులు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేదపండితులు రమేషాచారి, రవిచారి బృందం ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించి గురువారం వాల్మీకి నూతన ఆలయ పునర్నిర్మాణ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు వేదపండితులు తెలిపారు.



కేటీదొడ్డిలో..

విజయవంతం చేయండి

కేటీదొడ్డి: వాల్మీకి జయంతిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో వాల్మీకి గద్వాల నియోజకవర్గ అధ్యక్షుడు ఆంజనేయులు, మండల అధ్యక్షుడు టీచర్ గోవిందు ఆధ్వర్యంలోని ఉత్సవాలు నిర్వహించాలని కోరుతూ అధికారులకు వాల్మీకి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ధరూర్ మండల అధ్యక్షుడు సురేష్, కమిటీ సభ్యులు నాగరాజు, సురేష్, వేణు, రవి, తదితరులు ఉన్నారు.

పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారి విగ్రహాలు, ఆభరణాల ఊరేగింపులో భక్తులు

ఆత్మకూర్: మండలంలోని మూలమళ్ల గ్రామంలో శ్రీపాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం వేలాది మంది భక్తుల సమక్షంలో ప్రముఖ వేదపండితుడు శ్రీధర్‌జ్యోషి ఆధ్వర్యంలో శ్రీపాండురంగస్వామి, రుక్మిణిమాత కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అలాగే స్వామివారి అలంకరణ ఆభరణాలు ఊరేగింపు, పల్లకీసేవా ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో భజన మండలి ఆధ్వర్యంలో భజనలు చేశారు. అలాగే గురువారం శ్రీపాండురంగస్వామివారి రథోత్సవం, మహామంగళహారతి, ప్రసాద వితరణ ఇతర పూజలు చేపడుతున్నామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు యుగంధర్‌రెడ్డి, నారాయణ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



శ్రీపాండురంగస్వామి మూలవిరాట్

రోడ్డు నిబంధనలు పాటించాలి



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ మహేష్

అలంపూర్: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఉండవెల్లి ఎస్‌ఐ మహేష్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి, వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు చోటు చేసుకోనే అవకాశం ఉందన్నారు. బైక్ నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెంట్, కారు వంటి పెద్ద వాహనాలు నడిపే వారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

కేటీదొడ్డి: సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. మండల కేంద్రంలోని ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత బ్యాంకింగ్ సేవల వివరాలను అపరిచితులకు పంచుకోవద్దని, ఫోన్లలో వచ్చే ఓటీపీ, పేటీఎం, గూగుల్‌ప్లే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌ల స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలు నమ్మవద్దని తెలియని మేసేజ్‌లు క్లిక్ చేయకూడదన్నారు. గ్రామంలో అనుమానస్పదంగా కనిపించే వ్యక్తుల గురించి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బాల్యవివాహాలు చేసిన ప్రోత్సాహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని, మహిళలను బాలికలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



రామచంద్రారెడ్డి పాడె మోస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పటేల్ అరుణ ప్రభాకర్‌రెడ్డి కుమారుడు పటేల్ రామచంద్రారెడ్డి (26) బుధవారం గద్వాల మండలంలోని అనంతపురం గ్రామ సమీపంలోని దయ్యాల వాగు వద్ద కారు కల్వర్టును ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కుర్తిరావల్‌చెర్వు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు, గద్వాల, అలంపూర్ మాజీ ఎమ్మెల్యేలు డీకే భరత్‌సింహారెడ్డి, సంపత్‌కుమార్, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు, సీడ్ ఆర్గనైజర్లు బాధిత కుటుంబాన్ని వేరవేరుగా పరామర్శించారు. బుధవారం సాయంత్రం పటేల్ ప్రభాకర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో పటేల్ రామచంద్రారెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు.

బస్సుల కోసం ఎదురుచూపు



ఎర్రవల్లిలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఎర్రవల్లి: మండల కేంద్రంలో బుధవారం వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉన్నారు. దసరా పండగ కోసం హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వచ్చిన ప్రయాణికులు తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు ఎర్రవల్లి కూడలికి చేరుకున్నారు. దీంతో కూడలిలో ఎక్కడ చూసినా ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. దీనికి తోడు కర్నూల్, గద్వాల, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులు సైతం అక్కడి నుంచి నిండుగా రావడంతో బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉన్నారు. దీంతో పలువురు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి గమ్య స్థానాలకు పయనమయ్యారు.


తహసీల్దార్ ఎదుట 10 మంది బైండోవర్

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు, కోడలు, కొడుకులు భూతగాదాల విషయంలో పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదులు ఇస్తుండగా.. 10 మందిని తహసీల్దార్ హరికృష్ణ ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సర్వే నెంబర్ 118కు సంబంధించిన భూమి విషయంలో ఒక్కొక్కరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడంతో వారిని బైండవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళపై దాడి: కేసు నమోదు

కేటీదొడ్డి: భూమికి సంబంధించిన పాత గొడవలు మనస్సులో పెట్టుకుని ఓ వ్యక్తి మహిళపై దాడి చేసిన ఘటన కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని చింతలకుంట గ్రామానికి చెందిన కురువ మల్లమ్మకు అదే గ్రామానికి చెందిన మీసాల వీరన్న భూమికి సంబంధించిన పాత గొడవలు ఉన్నాయి. ఈ నెల 15న కురువ మల్లమ్మ అనారోగ్యంతో బాధపడుతూ గ్రామంలో ఉన్న ఆర్‌ఎంపీ వద్దకు వెళ్తుండగా.. మీసాల వీరన్న ఆమెను అడ్డగించి అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడి గాయపరిచాడు. బాధితురాలు మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఓ మోస్తారు వర్షం



ధరూరు: మండలంలో బుధవారం సాయంత్రం తేలిక పాటి వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సాయంత్రం 6.30 గంటల నుంచి 7 గంటల వరకు అరగంట పాటు వాన కురిసింది. ఈ వర్షం వరి పంటలకు లాభదాయకంగా ఉన్నా.. పత్తికి నష్టాలను తెచ్చి పెట్టేలా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కంటైనర్ బోల్తా

కొత్తకోట రూరల్: కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మంగళవారం రాత్రి కొత్తకోట బైపాస్‌లోని ఛత్రపతి విగ్రహం సమీపంలో చోటు చేసుకుంది. డ్రైవర్ రాఘవేంద్ర తెలిపిన వివరాల మేరకు బెంగుళూర్ నుంచి పార్సిల్ లోడ్‌తో హైదరాబాద్ వెళ్తుంది. కంటైనర్ రాత్రి 11గంటల సమయంలో కొత్తకోట సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ సైడ్ ఇచ్చినట్లే ఇచ్చి.. కంటైనర్‌కు అడ్డం రావడంతో డ్రైవర్ అదుపు చేసే క్రమంలో రోడ్డు కిందకు దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. బుధవారం ఉదయం ఘటన స్థలానికి చేరుకున్న హైవే సిబ్బంది రోడ్డు కింద పడిన కంటైనర్‌ను క్రేన్ సహాయంతో బయటకు తీశారు.